14

నాతోబాటు నలుగురు

మహానగరం. వర్షం కురవబోతూన్నది. నాలుగురోడ్ల కూడలి.

పెన్ షాపుదగ్గర కృష్ణమూర్తి నిలుచుని ఉన్నాడు.

ఐదు నిమిషాలు పట్టింది. దుకాణదారు తన కలం బాగుచేసి ఇచ్చాడు.

'బిల్' అందుకున్నాడు.

కాగితం లేదన్న సమస్య తీరిపోయింది.

ప్రొప్రయిటర్ దగ్గరనుంచి ఒత్తుకు పుస్తకం తీసుకున్నాడు. బిల్ వెనుక వ్రాశాడు—"తార."

కళ్ళలో మెరిసినట్లయింది. దానితో మనసులో తాను ఎల్లప్పుడూ ఎవరికైతే శుభం కోరతాడో ఆ మూర్తి—పెద్ద పూలజడ, కళ్యాణ తిలకం—దగ్గరగా వచ్చింది చిట్టచివరిసారి. కళ్ళల్లో ఏడుపుతో కూడిన నవ్వు. చిన్న పిల్లవాడికి బోధిస్తున్నట్లుగా చెప్పింది:

"ఇలా చూడమ్మా కృష్ణా! ఎందుకలా తల వంచుకుంటావు? నేరం చేసినవాడిలాగా! ఇదేం కొత్తకాదు చరిత్రలో. ప్రేమించుకున్న వాళ్లెవరూ పెండ్లి చేసుకోరు. అప్పుడు కథలే ఉండవు." పెదవులు నొక్కిపట్టింది. విషాదంగా నవ్వింది. చనువుగా తనచేయి 'తన' చేతిలోకి తీసుకుంది, ఇలా చెప్పింది:

"నన్ను మరచిపోయావు. నాకు తెలుసు.నా కప్పుడప్పుడు నీ యోగక్షేమాలు వ్రాస్తూ ఉండు. నెలకు ఒకటిచొప్పున వ్రాయి. కాదూ

రెండు నెలలకు. ఇదిగో ఈ కలం తీసుకో. నేను క్షణ క్షణం గుర్తుండటానికి."

తీసుకున్నాడు. అందుకోలేదు. ఆ వెలుగు తనది కాదు. దూరంగా దూరంగా మెరుస్తున్న చుక్క అయింది ఆమె. ఆమే తార.

ఎన్ని పుస్తకాలపైన వ్రాశాడో!

ఎన్నిచోట్ల శ్రీరామకు బదులు వ్రాశాదో తార. తార. తార!

తన జీవితాన్ని తెగిపోయిన ఏకతార చేసిన తార.

ఆమె ఇచ్చింది ఆ కలం గుర్తుగా, తనకు. తన ప్రాణం.

ప్రాణంలానే చూసుకున్నాడు.

దాని 'నిబ్' బాగు చేయించేందుకు తెచ్చాడు ఇవ్వాళ్టికి. కోపంగా వ్రాసింది ఉత్తరం-బొత్తిగా సమాధానం వ్రాయటం లేదని. సమాధానం వ్రాసేందుకు, ఈమధ్య వ్రాయనంటున్నది. అందుకే ఇక్కడికి వచ్చాడు. ఖరీదైన కలం. ఆవాళ పెండ్లిరోజున తనకెన్నో బహుమతులు వచ్చినవి. ఆ సాయంకాలం తాను ఈ బహుమతిని తన కిచ్చింది. "వెళ్ళిపోతున్నాను. అత్తారింటికి. తప్పదుకదా. ఉత్తరాలు వ్రాస్తూఉండు. ఇదిగో ఇది తీసుకో. ఇంతకంటే ఏం ఇచ్చేందుకూ తోచటంలేదు." ఆమె నవ్వు దిగులుగా ఉంది.

తీసుకున్నాడు. అదుగో. అదే ఈమధ్య వ్రాయనంటూంటే, 'తారకు ఉత్తరం వ్రాయాలి; వ్రాయకపోతే ఏం బాగుంటుంది?' అని తీసుకుని వచ్చాడు. రేపు ఉత్తరం వ్రాస్తాడు. "ఈ మధ్య ఒంట్లో ఏమీ బాగుండటంలేదు. ఆకలిలేదు. రుచిలేదు. ఇక్కడ ఈ ఊళ్ళో ఉద్యోగం మానేస్తామని ఉంది. ఉనికి బరువుగా ఉంది."

అనేనా! మనసులో అలా వ్రాస్తాడే కాని ఛీ! ఛీ! అసలు అలా వ్రాయడు. అలా వ్రాస్తే ఆమె మనస్సు నొచ్చుకోదూ? కంట నీరు పెట్టుకోదూ? ఆమె కంటనీరు పెట్టుకుంటే ఇంకేమైనా ఉందా? తన మనసు బావురు మంటుంది. "కులాసాగా ఉన్నాను. బాగా సినిమాలు చూస్తున్నాను. (వట్టిదే!) హాయిగా ఉంటున్నది. కిటికీలోంచి వెన్నెల వస్తున్నది. గోడమీది తొట్లలో చామంతిపూలు పూస్తున్నాయి. ఇప్పుడు రాత్రి పదిగంటలు. గుర్తుపట్టావా? నువ్విచ్చిన కలంతోనే ఈ అక్షరాలు వ్రాస్తున్నాను. ఎంతమంచిదో ఈ కలం. నీలాగా! ఎంత స్నేహమో ఈ కలంతో నాకు" అంటూనే వ్రాస్తాడు. ఇవి అబద్ధాలు కావా? నిజమే! అబద్ధాలే ఎప్పుడూ అందంగా ఉంటాయి. అందాన్ని ఆరాధిస్తాము. అంచేత అబద్ధాలను!

అదుగో ఆ కలమే ఇప్పుడు మళ్ళీ వ్రాస్తున్నది. 'తార' 'తార' అని.

డబ్బు ఇచ్చేశాడు కృష్ణమూర్తి.

ముందుకు అడుగిడబోతుండగా పెద్ద చినుకొకటివచ్చి మీద పడింది. తల పైకెత్తి ఆకాశంకేసిచూస్తే, పెద్ద ఏనుగుల గుంపు స్వేచ్ఛా విహారానికి బయలు వెడలినట్లు మబ్బులు. బస్‌స్టాప్ చేరే లోపల తడిసిపోకపోతే ఇంటికి చేరిపోవచ్చు. కాని ముందు కడుగిడ బోతే-అంతలోనే జల్లు.

తరువాత ఎడతెరిపిలేని వాన. తొండాల్లోంచి నీళ్ళు చిమ్ముతున్నట్లు. గాలి హోరు. దీపాలు వెలిగాయి, ఆరిపోయినవి. రోడ్లమీద చెట్లకొమ్మలు విరిగిపడుతున్నాయి. దీపాలు వెలుగుతున్నాయి. ఆరిపోతున్నాయి.

ఫుట్‌పాత్ పక్కనే గలగలశబ్దం చేసుకుంటూ నీళ్లు పారుతున్నాయి. సిమెంటురోడ్లు అందంగా ఉన్నాయి. ఇంత నగరం

లోనూ, రోడ్లమీద ఒక్క పురుగు కనబడటంలేదు. ఆకాశంలో ఎవరో బాణసంచా పేలుస్తున్నారు. బంగారపు విండ్లు విరిచిపారే స్తున్నారు. ఎంతబావుందో వాన.

అందరూ ఇళ్లు చేరుకున్న తరువాత కురవకూడదూ!

అందరూ ఒకే సమయానికి ఇళ్లు చేరుకుంటారని భగవంతుడికి నమ్మక మేమిటి?అందుచేతనే వాన ఎప్పుడు పడితే అప్పుడే వస్తుంది.

కృష్ణమూర్తికి ఏమీ తోచటంలేదు.

బిల్ కాగితమంతా నిండిపోయింది తారలతో. 'నిబ్' బాగుచేయ డానికే పదిరూపాయల 'బిల్' చేశాడు. అందుచేత కుర్చీలో కూర్చో బెట్టాడు, ప్రొప్రయిటరు. బయట వాన కురుస్తున్నది. జోరున వాన. హోరున వాన. భోరున కురుస్తున్నది.

గూళ్ళలోని పక్షుల్లాగ రోడ్లపైన ఎదురుగా కొట్లలోని మను షులు ఆత్రంగా చూస్తున్నారు. ఎవరో పట్టి బంధించినట్లు సిటీ బస్సులు కూడా ఆగిపోయినవి. "అఖిల లోకమ్ము ఉదకమయత్వ మొదవె" అన్నట్లుగా ఉంది.

కృష్ణమూర్తికి విసుగ్గా ఉంది. ఇంతలోనే హోరు తగ్గింది. జోరుతగ్గింది. దీపాలు మిలమిలా మెరుస్తున్నాయి. వాన ఆగి పోయింది. తుడిచి పెట్టినట్లుగా ఉన్నాయి రోడ్లు.

ఒక్కొక్కరే మనుషులు రెక్కలార్చుకున్న పక్షుల్లా రోడ్డు మీదికి వస్తున్నారు. ఎలెక్ట్రిక్ తీగెల వెంబడి నీళ్ల చుక్కలు చుక్క లుగా కొంతదూరం ప్రయాణం చేస్తూ రాలిపోతున్నాయి. దీపాల కాంతుల్లో నీటిచుక్కలు మెరిసిపోతున్నాయి. చెట్లమీద పక్షులు రెక్కలార్చుకుంటున్నాయి. సైకిళ్ళూ, బళ్ళూ, రిక్షాలూ, మళ్ళీ రోడ్ల

పైన మనుషులూ పారుతున్నారు. నీళ్ళు పారటం తగ్గిపోయింది. ఆకాశంలో మేఘాలు చెదిరిపోలేదు. మనుషులు నడుస్తున్నారు. రిక్షాలూ, కార్లూ తప్పించుకుంటూ కృష్ణమూర్తి నడుస్తున్నాడు.

హోటల్లో భోంచేసి పోవాలి. ఈ లోపున మళ్ళీ వాన రావచ్చు.

రావచ్చునేమిటి? వస్తుంది.

వానలో తడవటమంటే తగని భయం కృష్ణమూర్తికి.

అందుచేత 'ఈపూట భోజనం మానేస్తే' అన్న ఊహ తట్టింది.

రిక్షాలో ఎక్కి బస్‌స్టాప్‌కు పోతే?!

ఇన్ని ఆలోచనలు!

పోస్టాఫీసుకు వెళ్ళి ఉత్తరం వ్రాసి పడేస్తే? కాదు, స్తిమితంగా వ్రాయాలి. కృష్ణమూర్తి ఆలోచిస్తూ నడుస్తున్నాడు. మళ్ళీ వాన వచ్చింది.

మహానగరం. వేలం హాలులో చిక్కుబడిపోయాడు. రతన్ లాల్ మార్వాడీ! వాన కురుస్తున్నది. ఎడతెరపిలేని వాన.

సాయంకాలం ఆరుగంటలు. ఏడుగంటలు. ఎనిమిదిగంటలు. ఇంటిదగ్గరకు ఆ పెద్దమనుషులు వచ్చి ఉంటారు. వాళ్ళకు కారుంది. వాళ్ళు వస్తారు. తనను పిసినారి అని అంటారు అందరూ. అంతే అన్నారు. లేకపోతే ఇంత డబ్బు ఎలా కూడబెట్టేవాడు తాను? అప్పు లివ్వటం, ఎదైనా తాకట్టుపెట్టుకుని. వడ్డీ పెరగటం, అసలుకన్నా. వాళ్ళు అప్పు తీర్చలేక పోవటం, ఆ వస్తువు తనది కావటం. అట్లా

ఎన్ని? రేడియోలు, గడియారాలు, కంచాలు, చెంబులు, సోఫాలు-ఇంకా ఇంకా! అదే తెలివి. డబ్బు ఖర్చుపెడుతూ కూడబెట్టలేం. కూడబెట్టడమంటేనే ఖర్చుపెట్టక పోవడం. తాను ఇంతడబ్బు కూడ పెట్టీ కారుకొనలేదని అయిన వాళ్ళు తనకు వినపడేలాగానే అప్పుడప్పుడు నవ్వుకుంటూ వుంటారు. వాళ్ళ కేం తెలుసు? ఎప్పుడో, ఎవరో, కారుకూడా తనదగ్గర తాకట్టు పెడతారు. తరవాత విడిపించుకోలేరు. అప్పుడు తనకు చౌకగా కారువస్తుంది. 'సెకండ్ హాండ్' ది కొనాలన్నా బోలెడు డబ్బవుతుంది. వాళ్ళకు తెలీదు. డబ్బు కూడబెట్టడం గొప్ప తెలివితేటలతో కూడుకొని ఉన్నపని. వాళ్ళకు తెలీదు. వాళ్ళకు తెలీకపోతే తెలీకపోయె. ఇప్పుడు ఇంటి కెలా పోవాలి? ఈ వానలకు అర్థంలేదు. పాడువాన! టాక్సీకూడా చుట్టుపక్కల లేదు. కొంచెం ఇప్పుడిప్పుడే తగ్గుతున్నది వాన.

రతన్‌లాల్ మహా విసుక్కుంటున్నాడు. అవతల పెద్ద మనుషులు ఈపాటికి తన ఇంటికి వచ్చి ఉంటారు. ఈ వ్యవహారం పైసలయితే, తనకు చాలా లాభం గిడుతుంది.భగవాన్! రిక్షా అయినా కనబడదే? కొంచెం జోరు తగ్గినట్లుగా ఉంది.

"ఏయ్ రిక్షా!"

"...............''

వాడి కెంత గర్వమో!

అవును. ఇప్పుడు పదిమంది పిలుస్తారు. విచిత్ర మేముంది? రూపాయి కావాలిట వాడికి.

"ఏం చేస్తాం మరి, కర్మ!" రతన్‌లాల్ ఏడ్చుకున్నాడు.

రూపాయి పోతున్నది—ఎట్లా?

"ఎందుకోయ్ రూపాయి? ఇంత అన్యాయమా మరీ!"

వాడు శాంతంగా సమాధానం చెప్పాడు:

"అన్యాయమేముంది బాబూ! జోరున వానకురుస్తూంది! ఈ వానలో ఎవరొస్తారండీ!"

"ముప్పావులాకు రావోయ్."

"రాను బాబూ."

"కలికాలం. అంతా అన్యాయమే" అని గొణుక్కున్నాడు రతన్‌లాల్. రిక్షావాడన్నాడు: "వాన కురుస్తున్నది బాబూ. లేకపోతే ఆరణాలకే తొక్కుతాను. రెక్కల కష్టం సూడాలి బాబూ. దర్మ పెబువులు. ఈ సలికి సచ్చిపోతాను. సప్పగా తడిసిపోతాను బాబూ."

ఒళ్ళంతా దహించుకుపోయింది రతన్‌లాల్‌కు. తనకు కారు లేకపోవడం ఎంత తెలివి తక్కువ పనయిపోయింది అనుకున్నాడు. మనస్సుకి విపరీతమైన కష్టమూ తోచింది.

"సరే పోనియ్" అన్నాడు ఎంతో అయిష్టంగా.

రిక్షావాడి ముఖం వెలిగిపోయింది. పరమోత్సాహంతో నీళ్ళను చప్పుడు చేసుకుంటూ తొక్కుకుపోతున్నాడు. వాన కురుస్తూంది. ఎలెక్ట్రిక్ దీపాలు మసక మసకగా కనపడుతున్నాయి. రిక్షాపోతూన్నది. రోడ్డు మీద ఒక్కపురుగూలేదు. ఒక్కొక్క చోట చక్రాలు నీళ్ళను కోసుకుంటూ పోతున్నాయి. గలగలా పారుతున్నాయి. రతన్‌లాల్‌కు చాలా అసంతృప్తిగా ఉంది. బూట్‌పైన నీళ్ళుపడుతున్నాయి. రిక్షా వాడు పూర్తిగా తడిసిపోతున్నాడు. రిక్షా పోతూనే ఉంది. రతన్‌లాల్‌కు కోపంగా ఉంది.

రిక్షా ఓ చోట వంకరగా తిరిగి ఇంకో వీధిలోకి పోతున్నది. చిన్నచిన్న కాఫీహోటళ్ళు రెండూ, ఓ కిళ్ళీబడ్డీ, దూరంగా పార్కు,

ఒకపక్కగా ఆడపిల్లల కాలేజీ, ఓ ఫర్లాంగు దూరంలో మునిసిపాలిటీవాండ్లు కట్టించిన క్వార్టర్లూ—మధ్య కూడలి. రిక్షా అక్కడ తిరుగుతున్నది మలుపు. ఫుట్‌పాత్ పక్కనే రిక్షా ఆపాడు రిక్షావాడు. రతన్‌లాల్‌కు చాలాకోపం వచ్చింది. రిక్షావాడు రిక్షా దిగిపోయాడు. వాన కురుస్తూనే ఉంది. "ఎందుకు దిగావు? ఏమి వచ్చింది నీ రిక్షాకు? లేక నీకేమైనా వచ్చిందా? పోనీ, త్వరగా ఇంటికి పోవాలి. నేను కూడా తడుస్తున్నాను" అంటున్నాడు రతన్‌లాల్ కోపంగా. రిక్షావాడు రోడ్డుమీద ఫుట్‌పాత్ పక్కనే ఉన్న ఏదో వస్తువును చప్పున పైకి తీశాడు. రతన్‌లాల్‌కు కోపం తగ్గిపోయింది. "ఏమిటేమి"టన్నాడు, కంగారుగా, ఆశగా, అసూయగా. రిక్షావాడు రతన్‌లాన్ చేతికి ఒక మంచి 'పెన్' ఇచ్చాడు. నిర్వికారంగా రిక్షా తొక్కుకుంటూ ముందుకు సాగిపొయ్యాడు. వాన కురుస్తూనే ఉంది. ఎలెక్ట్రిక్ దీపాల క్రిందుగా రిక్షా పోతున్నది. వాన జోరు కొంచెం తగ్గింది.

రతన్‌లాల్ మనస్సులో వెయ్యి ఆలోచనలు. పెద్ద ఆశ నోరు తెరుచుకున్న తిమింగిలంలా అతణ్ణి మింగుతూంది. రతన్‌లాల్ మింగుడుపడ్డాడు. వెయ్యి ఆలోచనలు, ఉక్తి-ప్రత్యుక్తులు మనస్సులో. "పాపం! ఎవరో పారేసుకున్నారు" అన్నాడు రిక్షావాడు నీళ్ళచప్పుడుతో కలిసిపోయే మాటలతో.

రతన్‌లాల్ మాటాడలేదు.

ఏమీతోచలేదు ప్రతిదీపం క్రిందనూ క్షణంసేపు చూస్తున్నాడు ఆకాశాన్ని.

మనస్సులో మెరుపు మెరిసింది.

"ఎంతో ఖరీదుకాదు. నాలుగైదు రూపాయ లవుతుంది" అన్నాడు రతన్‌లాల్.

"అంతేనా" అన్నాడు రిక్షావాడు.

రతన్‌లాల్ గుండెలో వెయ్యి కుశంకలు పుట్టుకువచ్చినై. అసంతృప్తి మూలిగింది. గాంభీర్యం చెక్కుచెదరకుండా "అంతే" నన్నాడు. వానతగ్గి కురుస్తూఉన్నది.

రిక్షా పోయిపోయి ఇనుపకటకటాల ఒక పాతబంగళా ముందు ఆగింది.

"ఇక్కడే" అని రతన్‌లాల్ రిక్షా దిగాడు.

"లోపలకురా, పాపం, తడుస్తావు" అన్నాడు రిక్షావాడితో.

రతన్‌లాల్ చూశాడు. తన ఇంటిముందు కారులేదు. గేటు దగ్గరి పెద్దలైటు వేసిఉంటుంది ఇంటావిడ, మర్యాదకోసం మళ్ళీ తియ్యలేదు. రతన్‌లాల్‌కు కోపం వచ్చింది. మెట్లుఎక్కి పైకి వచ్చాడు. లైటు తీసేశాడు. కోపంగా అరిచాడు ఇంటావిడ నుద్దేశించి: "లైట్ తీసెయ్యడం మరచిపోయావా?" రిక్షావాడు వెనకనే వచ్చాడు. రూపాయి వస్తోంది ఇప్పుడు తనకు. రతన్‌లాల్ భార్యను పిలిచి రూపాయి తెమ్మన్నాడు. ఆమె గ్రహించింది. వరండాలో రిక్షావాడు నిలుచునిఉన్నాడు నీళ్ళుకారుతూ. ఆమెముఖం వెలుగుతున్న దీపం కాస్తా ఆరిపోయినట్లయింది. రూపాయా? ఆమెకూ కోపం వచ్చింది.

రతన్‌లాల్ వరండాలోకి వచ్చాడు.

రూపాయి ఇచ్చాడు. రిక్షావాడు సంతోషపడ్డాడు. కాని కదల్లేదు. రతన్‌లాల్ అన్నాడు. "ఏమోయ్ నువ్వేంచేసుకుంటావు ఈ కలం? మా పిల్లవాడు కలం కొనిపెట్టమని రోజూ పోరుతున్నాడు, నేనే మరిచిపోతున్నాను. ఏదో ఉంటుంది. మూడు నాలుగు రూపాయలు చేస్తుందేమో ఇది. అంతే అసలు ఖరీదన్నమాట. చాలా పాతబడిపోయింది. అవులే, యీ విషయాలన్నీ నీకేమి తెలుస్తాయి?

ఓ రూపాయి ఇస్తాను. నా కిచ్చేస్తావా?" అంటూ రతన్‌లాల్ స్నేహ పిచ్చిలంగా నవ్వాడు.

ఇంకోరూపాయి! రిక్షావాడికి గుండెల్లో సంతోషం కలిగింది. తన అదృష్టం, లేచినవేళ అనుకున్నాడు. ఆశ పుట్టింది. తనుకూడా తెలివికలవాడే అని నిరూపించుకోవాలి. అంత తేలిగ్గా లొంగిపోతాడా? గర్వంకూడా కలిగింది.

"మూడు రూపాయలివ్వండి బాబూ. తళతళా మెరిసిపోతుంటేను! కొత్తదే!" అన్నాడు.

"అయితే తీసుకపో."

రిక్షావాడికి తెలిసిపోయింది. తను ఉట్టి తెలివితక్కువవాడు. తెలివి చూపించుకోబోతే ఇంతే అవుతుంది. దెబ్బతిన్నాడు. రతన్‌లాల్ చేతిలోనుంచి ఆ కలాన్ని అందుకోబోయాడు.

రతన్‌లాల్ అన్నాడు : "నువ్వేం చేసుకుంటావ్ దాన్ని? నీకు తెలీదు. ఎవరో అర్ధో, పావలాయో పెట్టి నీ చేతుల్లోనుంచి తీసుకుంటారు. పోనీ రెండురూపాయ లిస్తాను. ఇచ్చేసిపో. మా పిల్లవాడు పోరుపెట్టుతున్నాడు, లేకపోతే నేను తీసుకోకనేపోదును."

రిక్షావాడు "సర్లెండి బాబయ్యా" అన్నాడు.

"మూడు రూపాయలే! ఒక్కసారి రిక్షా లాగినందుకు!" రిక్షావాడికి పట్టరాని ఆనందం కలిగింది.

తలుపుచాటునుంచి ఇంటావిడ చూస్తూఉంది.

రిక్షావాడు ఆ సంతోషంలో వరండామెట్లు జారి పడబోయాడు. పడలేదు. రోడ్డుమీద రిక్షా గణగణ గంటచప్పుడు చేసుకుంటూ పోతు

న్నది. ఇంటావిడతో రతన్‌లాల్ తన కవాళ ఎనభై రూపాయల లాభంగురించి చెప్పుతూ, ఆమె రెండురూపాయల దుఃఖాన్ని పోగొట్టుతున్నాడు, విడమరిచి చెప్పుతూ.

వాన వెలిసింది.

చెట్ల ఆకులపైనుంచీ నీటిబొట్లు రాలుతున్నాయి ఒక్కొక్కటిగా. రోడ్డుమీద దీపాలకాంతి ప్రతిఫలిస్తున్నది. జనసమ్మర్దమూ తగ్గిపోయింది. ఆకాశం తెరిపిగాఉంది.

ఏడ్చిఏడ్చి అలసిపోయిన పసిపాప నిద్రలా మహానగరంకూడా ప్రశాంతంగా ఉంది. రాత్రి ఒకవంతు గడిచింది.

మహానగరం. అందులో ఓమూల పాతబంగళా. ఆ పాత బంగళాలో కారు గేరేజి ఉంది.

ఆ కారు గేరేజిలో రామారావు కాపురముంటున్నాడు. అంటే, మార్వాడీసేటుగారు మిక్కిలి దయకలవాడై గేరేజిప్రక్కనే ఇంకో గదిలాంటిది కట్టించి దాన్నీ, గేరేజీనీ నలభై రూపాయలకు రామారావుకు అద్దెకిచ్చాడు.

రామారావు కిందటినెల అద్దె బకాయిపడ్డాడు.

రామారావు భయపడ్డాడు. ఒకవంతు రాత్రి గడిచిన తరువాత సేట్‌గారు తనను పేరెట్టి పిలవడం రామారావుకు దిగులైంది. రామారావు ఇదివరలో ఎప్పుడూ బకాయిపడలేదు. క్రిందటి నెలలో భార్యను పుట్టింటికి పంపించాడు. అందుకని యీనెల అద్దె యివ్వలేకపోయాడు. రామారావు గదివాకిలి దాటి బయటకువచ్చాడు, సేట్ వరండాలో నిలుచుని పిలుస్తున్నాడు.

"చూశారా, రామారావుగారూ, ఈ కలాన్ని చూడండి. జాగ్రత్తగా చూడండి. ఎంత ఖరీదవుతుందేమిటి?"

రామారావుకు ఆనందమైంది. అద్దె విషయం అడిగేందుకు కాదు సేట్ పిలిచింది. రామారావు ఉత్సాహంగా చూశాడు. అలాంటి కలం రామారావు ఎప్పుడూ చూచి ఎరుగడు. పరిశీలించి చూశాడు, బాగా తెలిసినవాడిలాగా. "అబ్బా! చాలా ఖరీదవుతుందండి. ఇలాంటివి అసలు ఇప్పుడు దొరకనే దొరకటంలేదు" అన్నాడు. సేట్‌కు చాలా సంతోషమైంది.

"ఎనభై రూపాయలవుతుంది" అన్నాడు సేట్. రామారావు ఉత్సుకతతో చూశాడు దానివైపు.

"దొరికింది" అన్నాడు సేట్.

రామారావు అదిరిపడ్డాడు. తనది చాలా విలువైన వస్తువు ఏదో పోయినట్లుగా వ్యథ కలిగింది అతడికి.

చెప్పలేని అసూయ కలిగింది.

సేట్ చెప్పుకునిపోతున్నాడు—రిక్షావాడు చూశాడట ముందు. దాని ఖరీదు నాలుగురూపాయలకంటే ఎక్కువ ఉండదని చెప్పాడట తాను. వాడు రెండురూపాయలకు ఇచ్చాడట. తాను వాన కురవక ముందే ఇల్లుచేరుకుని ఉన్నట్లయితే ఈ కలం యీవాళ తనకు చిక్కేది కాదు. ఇంత పెద్ద వాన కురవటం, తాను బజారులో చిక్కుపడిపోవటం, తనకు ఇంటిదగ్గర పని ఉండటంవలన రిక్షావాడు రూపాయడిగినా, తాను ఒప్పుకునిరావడం, వచ్చినందుకు రోడ్డుమీద ఇంత మంచికలం పడిఉండటం, రిక్షావాడే చూచి తీసుకున్నా తనకు రావలసి ఉండటం అంతా చెప్పాడు సేట్.

రామారావుకు ఎంతో బాధ కలిగింది.

సేట్ ఎంతో తృప్తిగా ఉన్నాడు. రామారావు యోగక్షేమాలు అడిగి కనుక్కున్నాడు. రామారావుకు మంటగా ఉంది. అసహ్యంగా ఉంది. అసూయగా ఉంది. బాధగా ఉంది. కోపంగా ఉంది. సేట్‌కు నవ్వు వస్తున్నది. తలుపుచాటున ఇంటావిడ నిలుచుని ఉంది. ఆమె కళ్లు ఉజ్జ్వలంగా ఉంటాయి ఎప్పుడూ అని సేట్ హృదయం పలుకుతున్నది. సేట్ తృప్తిగా మాట్లాడుతున్నాడు.

రామారావు సేట్‌దగ్గర సెలవుతీసుకొని తనగదిలోకి వెళ్లాడు. పడుకున్నాడు. నిద్ర రావటంలేదు. మనసు పరిపరివిధాల పోతున్నది. పరమేశ్వరునికి దరిద్రులయెడల గల నిర్దయకు ఆతని మనస్సు మిక్కిలి నొచ్చుకోసాగింది. రామారావుకు యీ సంఘటన చాలా విచిత్రంగా ఉంది. అదృష్టం అనేది నిజంగా ఉన్నదనిపిస్తున్నది. ఈ సంఘటన తనచెవిని పడకపోతే చాలా బావుండేది. ఆ కలం తనకు దొరికితే? తననుండి సేట్ గుంజుకున్నట్లుగా బాధపడసాగాడు రామారావు. మాటిమాటికి భగవంతుడియెడల ఆతడి మనస్సు అప్రసన్నం కాసాగింది. రామారావుకుకథలువ్రాసే అలవాటుంది. చాలాసేపటివరకు యీ సంఘటనను గురించే ఆలోచిస్తూ కూర్చున్నాడు.

మహానగరం.

వాన కురిసి వెలిసింది.

ఒకానొక పేటలో ఒక గల్లీలో ఒకచోట కల్లుదుకాణం ఉంది.

ఒక్క గంటలో మూడురూపాయలు సంపాదించిన రిక్షావాడొకడు ఆ సంతోషం పట్టలేక ఆ కల్లుపాకలో కూచుని కడుపునిండా తాగుతున్నాడు.

ఇంకాసేపటికి వాడు ఇంటికి పోతాడు. మధ్యలో వాన కురి

సింది కాబట్టి చౌకయిపోయిన మల్లెదండల్ని పొద్దుపోయి ఇంటికి పోతూ ఏ బ్రిడ్జిమీదనో వాడు కొనవచ్చు. కొన్నా. నిషాలో ఇంటికి పోయి పెళ్ళాన్ని కొట్టవచ్చు. వాడి పెళ్ళాం ఏడవనూ వచ్చు.

రామారావు రోడ్డుమీద దొరికిన కలాన్ని గురించి కథ వ్రాపి ముందు ముందు పదిరూపాయిలు సంపాదించుకోవచ్చు. భగవంతుని దయావిహీనతకు నొచ్చుకుంటూ కూడా.

అదేనగరంలో మరోచోట, మరోపేటలో రాత్రి పొద్దుపొయిన తరువాత కృష్ణమూర్తి తారకు ఉత్తరం రాదామని కలంకోసం వెతుక్కొని అది పోయిందని గ్రహించుకొని బావురుమని ఏడ్చి ఉండవచ్చు. తన కళ్ళలో దూరం దూరంగా ప్రకాశిస్తున్న తారను తలచుకుని ఆమె యిచ్చిన కలాన్ని తాను హోటల్లో భోజనం చెయ్యడానికి వెళ్ళేటప్పుడో, భోంచేసి వచ్చేప్పుడో పోగొట్టుకొన్నందుకు ఆ రాత్రంతా కుమిలిపోనూవచ్చు.

పాపం, కృష్ణమూర్తి దిండులో తలదాచుకుని తారను గురించే ఆలోచించుకొంటున్నాడు.

సేట్ రతన్‌లాల్ ఎవరో తనదగ్గర 'కారు' తాకట్టు పెట్టి డబ్బు అడుగుతున్నట్టు కల కంటున్నాడు.

రిక్షావాడి భార్య 'తాగొచ్చావా సచ్చినోడా' అని నోటికి వచ్చినట్టల్లా తిడుతూంది.

రామారావు కథ వ్రాసుకుంటున్నాడు. ఆ రామారావును నేనే.

———